తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్

94949 23460



https://epaper.tharangalu.in

RNI. TELTEL / 2022 / 83463

జాతీయ దిన ప్రతిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
శనివారం
09 మే 2026
సంపుటి 03
సంచిక 211
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh    Epaper: www.tharangalu.in.com


# తమిళనాడులో రాజకీయ సంచలనం



- డీఎంకే--ఏఐఏడీఎంకే కలయికపై జోరుగా ప్రచారం
- టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్ ప్రయత్నాలు
- "డీఎంకే--ఏఐఏడీఎంకే కలిస్తే 107 మంది ఎమ్మెల్యేల రాజీనామా"
- రాష్ట్ర రాజకీయాల్లో వేడెక్కిన అధికార పోరు

చెన్నై, మే 8 తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా ఉత్కంఠభరితంగా మారాయి. ప్రభుత్వం ఏర్పాటుపై ఇంకా స్పష్టత రాకపోవడంతో రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. టీవీకే ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని విజయ్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ, ఇతర పార్టీల నుంచి పూర్తి స్థాయి మద్దతు మాత్రం లభించడం లేదు. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త కూటముల చర్చ మొదలైంది. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు వేర్వేరు కూటముల్లో కొనసాగుతున్నాయి. కొన్ని పార్టీలు డీఎంకేతో, మరికొన్ని ఏఐఏడీఎంకేతో చేతులు కలిపాయి. ఇప్పుడు టీవీకేకు మద్దతు ఇవ్వాలంటే ఆయా కూటములను విడిచిపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజకీయంగా ఇది ప్రమాదకరమవుతుందనే భావనతో చాలా పార్టీలు వెనక్కి తగ్గుతున్నట్లు సమాచారం. దీంతో విజయ్ ప్రభుత్వ ఏర్పాటుపై అనిశ్చితి నెలకొంది.

ఇదే సమయంలో తమిళనాడులో బద్ధ శత్రువులుగా భావించే డీఎంకే, ఏఐఏడీఎంకే కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాలపై జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ అంశంపై స్పందించిన విజయ్.. ఒకవేళ ఈ రెండు పార్టీలు కలిసి అధికారంలోకి వస్తే టీవీకే తరఫున గెలిచిన 107 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తారని హెచ్చరించారు. విజయ్ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారాయి. మొదట్లో టీవీకే ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటుపై డీఎంకే, ఏఐఏడీఎంకే సానుకూలంగా స్పందించినట్లు ప్రచారం జరిగింది. కానీ పరిస్థితులు మారడంతో ఇప్పుడు రెండు పార్టీలు కొత్త రాజకీయ వ్యూహాలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో తమిళనాడు రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారాయి. అయితే ఏఐఏడీఎంకేతో పొత్తు వార్తలను డీఎంకే

➤ మిగతా 2వ పేజిలో..



## ఉచిత బస్సు పథకాలపై పెరుగుతున్న ఫిర్యాదులు

- బస్టాప్‌ల వద్ద ఆగని బస్సులతో ప్రయాణికుల ఇబ్బందులు
- రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆర్టీసీ సేవలపై అసంతృప్తి
- ప్రజా రవాణాలో నిర్లక్ష్యంపై మండిపడుతున్న ప్రజలు

డెస్క్, మే 8 తెలుగు రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాలు అమలవుతున్న నేపథ్యంలో ఆర్టీసీ సేవలపై ప్రజల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా బస్టాప్‌ల వద్ద ప్రయాణికులు వేచి ఉన్నప్పటికీ బస్సులు ఆగకుండా వెళ్లిపోవడం, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం, సమయపాలన లేకపోవడం వంటి అంశాలు ప్రయాణికుల్లో అసంతృప్తిని పెంచుతున్నాయి. తాజాగా కృష్ణా జిల్లాలో జరిగిన ఘటన ఈ సమస్యను మరోసారి వెలుగులోకి తీసుకొచ్చింది. కృష్ణా జిల్లా కంకిపాడు ప్రాంతంలో బస్టాప్‌లో పలువురు ప్రయాణికులు వేచి చూస్తుండగా ఓ ఆర్టీసీ బస్సు ఆగకుండా వెళ్లిపోవడంపై పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కారుతో బస్సును అడ్డగించి డ్రైవర్, కండక్టర్‌ను నిలదీసిన ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. ప్రయాణికులను పట్టించుకోకుండా వ్యవహరిస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రస్తుతం

➤ మిగతా 2వ పేజిలో..

## రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి




- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు
- పోలీస్ వ్యవస్థను రాజకీయాలకు వాడుకుంటున్నారని ఆరోపణ
- ప్రజల భద్రతపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్

హైదరాబాద్, మే 8 ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

➤ మిగతా 2వ పేజిలో..

## భవిష్యత్ సవాళ్లకు సిద్ధంగా ఉండాలి

- జైపూర్‌లో సంయుక్త కమాండర్ల సమావేశం
- ఆపరేషన్ సిందూర్‌పై రాజ్‌నాథ్ ప్రశంసలు
- సైనిక దళాల సామర్థ్యంపై కేంద్ర మంత్రి నమ్మకం

జైపూర్, మే 8 దేశ భద్రతా పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో భారత సాయుధ దళాలు భవిష్యత్ సవాళ్లకు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించిన సంయుక్త కమాండర్ల సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ అనిశ్చిత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సైన్యం అత్యాధునిక వ్యూహాలతో

➤ మిగతా 2వ పేజిలో..

## మైనారిటీ విద్యార్థులకు ప్రత్యేక డిగ్రీ కళాశాలలు

- నైపుణ్యాభివృద్ధి, ఏఐ శిక్షణపై సీఎం రేవంత్ దృష్టి
- జీవనోపాధికి ఉపయోగపడే విద్య అందించాలని ఆదేశం
- మైనారిటీ సంక్షేమ శాఖపై సీఎం సమీక్ష



హైదరాబాద్, మే 8 మైనారిటీ విద్యార్థుల కోసం ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కళాశాలల్లో నైపుణ్యాభివృద్ధి, కృత్రిమ మేధస్సు శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మైనారిటీ సంక్షేమ

➤ మిగతా 2వ పేజిలో..



## రిటైర్డ్ ఐపీఎస్ భార్య హత్య కేసులో సంచలనం

- పనిమనిషిపైనే హత్య ఆరోపణలు
- బంగారం, నగదుతో పరారైన నిందితులు
- దర్యాప్తును పర్యవేక్షించిన డీజీపీ

హైదరాబాద్, మే 8 హైదరాబాద్‌లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య సునంద హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో ఇంట్లో పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన పనిమనిషి కల్పన ప్రధాన నిందితురాలిగా పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కల్పన మరో ఇద్దరితో కలిసి ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఈ హత్యకు పాల్పడినట్లు

➤ మిగతా 2వ పేజిలో..

# కొడంగల్‌ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- అభివృద్ధిపై సీఎం ఫోకస్
- 2027 నాటికి పనులు పూర్తి
- బాలాజీ ఆలయానికి భూమిపూజ
- విద్య, పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి



కొడంగల్, మే 8 అభివృద్ధి విషయంలో రాజకీయాలు, గుంపులు, గ్రూపులు పక్కనపెట్టి అందరూ కలిసికట్టుగా పనిచేస్తే కొడంగల్ నియోజకవర్గాన్ని రాష్ట్రానికే కాకుండా దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న అభివృద్ధి పనులను 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. కొడంగల్‌లో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం.. నియోజకవర్గ భవిష్యత్‌పై భారీ ప్రణాళికలను వెల్లడించారు. కొడంగల్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొడంగల్ బాలాజీ ఆలయాన్ని తెలంగాణ పేదల తిరుపతిగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం తెలిపారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా కొడంగల్‌లో 430 పడకల

➤ మిగతా 2వ పేజిలో..

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
శనివారం, 09 మే , 2026



## తమిళనాడులో రాజకీయ సంచలనం

ఖండించింది. పార్టీ అధికార ప్రతినిధి టీకేఎస్ ఎలంగోవన్ మాట్లాడుతూ ఈ ప్రచారంలో నిజం లేదన్నారు. గవర్నర్ విజయ్ పార్టీకి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఈ నెల 10 వరకు గడువు ఇచ్చారని, ఆ తర్వాత పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇక డీఎంకే--ఏఐఏడీఎంకే పొత్తు అనైతికమని కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు చేసింది. దీంతో తమిళనాడులో అధికార పోరు మరింత వేడెక్కింది. ఇప్పుడు రాష్ట్ర ప్రజల దృష్టంతా ఒక్కటే.. విజయ్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తారా? లేక డీఎంకే--ఏఐఏడీఎంకే కొత్త కూటమి అధికారంలోకి వస్తుందా? అన్నదానిపై నిలిచింది.

## కొడంగల్‌ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

ఆసుపత్రి నిర్మాణానికి కూడా సీఎం శంకుస్థాపన చేశారు. అలాగే దౌల్తాబాద్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంతంలో ఇప్పుడు సమగ్ర అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. కొడంగల్ ప్రాంతాన్ని విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళిక రూపొందించినట్లు సీఎం వెల్లడించారు. 225 ఎకరాల్లో మెడికల్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటీఐ, సైనిక్ స్కూల్స్‌తో కూడిన ఎడ్యుకేషనల్ హబ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గతంలో చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థులు కొడంగల్‌కు వచ్చే పరిస్థితిని తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు.

మక్తల్--నారాయణపేట--కొడంగల్ ప్రాంతాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. కృష్ణా నది జలాలతో ఈ ప్రాంత భూములు తడవాలని, ఇందుకోసం భూసేకరణ పూర్తైందని, అవసరమైన అనుమతులు కూడా వచ్చాయని తెలిపారు. పనుల పురోగతిపై ప్రతి నెల సమీక్ష నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కోరారు. ఈ ప్రాంతంలో రైల్వే, పరిశ్రమల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కృష్ణా--వికారాబాద్ రైల్వే లైన్‌కు సూత్రప్రాయ అనుమతి వచ్చిందని వెల్లడించారు. టేకులగోడు ప్రాంతంలో భారీ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆరు నెలల్లో పరిశ్రమ నిర్మాణం ప్రారంభమైతే స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.లగచర్ల వద్ద భారీ ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణం చేపడుతున్నామని, కోస్గి నుంచి అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 300 అడుగుల వెడల్పుతో రహదారి నిర్మాణం జరుగుతోందని సీఎం వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే కొడంగల్ ప్రాంత ఆర్థిక పరిస్థితి పూర్తిగా మారిపోతుందని చెప్పారు. కొడంగల్ బాలాజీ ఆలయం పునర్నిర్మాణం రాజకీయాలకు అతీతమైన ఆధ్యాత్మిక కార్యక్రమమని సీఎం స్పష్టం చేశారు. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చే భక్తులకు కూడా ఇది ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందని తెలిపారు. ఆలయ పునర్నిర్మాణం ద్వారా కొడంగల్ పేరు దేశవ్యాప్తంగా వినిపించేలా చేస్తామని అన్నారు.

సుందర వరదాచార్యుల చివరి కోరిక మేరకు ఆలయ అభివృద్ధి చేపడుతున్నామని సీఎం గుర్తుచేశారు. వారి సేవలను గుర్తుంచుకునేలా ఆలయ ప్రాంగణంలోని ఒక విడిదికి వారి పేరు పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ ప్రాంత ప్రజలు చిన్న చిన్న విభేదాలు పక్కనపెట్టి అభివృద్ధి కోసం కలిసిరావాలని సీఎం పిలుపునిచ్చారు. "ఈ రోజు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కొడంగల్ బిడ్డ మీ ముందున్నాను. కొడంగల్ అభివృద్ధి నా బాధ్యత. ఈ ప్రాంత ప్రతిష్టను దేశస్థాయికి తీసుకెళ్లేలా ప్రతి ఒక్కరూ సహకరించాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న నేర ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.పోలీస్ యంత్రాంగాన్ని రాజకీయ కక్షసాధింపులకు, ప్రతిపక్ష నాయకులను వేధించడానికి వినియోగిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల భద్రత, రక్షణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతోందని అన్నారు. శాంతిభద్రతల పరిస్థితిపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తున్న సమయంలోనే హైదరాబాద్ ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య హత్యకు గురవడం దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు.అదే విధంగా సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై యువకుడిని కత్తితో పొడిచి చంపిన ఘటన ప్రజల్లో భయాందోళనలు పెంచిందని అన్నారు. ఇటువంటి సంఘటనలు రాష్ట్రంలో పెరుగుతున్న అభద్రతా పరిస్థితులకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. నేరాల నియంత్రణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టాల్సిన పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వాన్ని విమర్శించే సోషల్ మీడియా వేదికలపై కేసులు పెట్టడానికి వినియోగిస్తోందని ఆరోపించారు.పోలీస్ వ్యవస్థను రాజకీయ అవసరాలకు వాడుకోవడం వల్లే శాంతిభద్రతలు కుప్పకూలాయని కేటీఆర్ అన్నారు. మహిళలపై నేరాలు, సైబర్ నేరాలు రాష్ట్రంలో భారీగా పెరిగాయని తాజా ఎన్‌సీఆర్‌బీ నివేదికలను ప్రస్తావించారు. హోంశాఖను కూడా తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడటంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే రాజకీయ వేధింపులు ఆపి పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో భరోసా కల్పించేలా పోలీసులు వృత్తిపరంగా పనిచేసే పరిస్థితులు కల్పించాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని కోరారు.

## రిటైర్డ్ ఐపీఎస్ భార్య హత్య కేసులో సంచలనం

అనుమానిస్తున్నారు. సునందను హత్య చేసిన అనంతరం ఇంట్లో ఉన్న బంగారం, నగదును బ్యాగుల్లో సర్దుకుని ముగ్గురు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఇంట్లోని సీసీటీవీ దృశ్యాలు, ఇతర సాంకేతిక ఆధారాల ఆధారంగా దర్యాప్తును వేగవంతం చేశారు.ఈ కేసు తీవ్ర సంచలనం రేపడంతో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ స్వయంగా ఘటనాస్థలాన్ని పరిశీలించారు. దర్యాప్తు పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు.పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. హత్యకు గల పూర్తి కారణాలు, దోపిడీకి సంబంధించిన వివరాలు దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అవకాశముందని పేర్కొన్నారు.

# ఉచిత బస్సు పథకాలపై పెరుగుతున్న ఫిర్యాదులు

➢ మొదటి పేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాలు ప్రజల్లో విపరీత ఆదరణ పొందుతున్నాయి. గ్రామీణ ప్రాంత మహిళలు, ఉద్యోగులు, విద్యార్థినులు, వృద్ధులు పెద్దఎత్తున ఆర్టీసీ సేవలను వినియోగిస్తున్నారు. అయితే ప్రయాణికుల సంఖ్య పెరిగినా అందుకు తగ్గట్లుగా సేవలు మెరుగుపడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చాలాచోట్ల బస్సులు పూర్తిగా నిండిపోయి రావడం, కొన్ని ప్రాంతాల్లో బస్సులు అసలు ఆగకపోవడం, సమయానికి రాకపోవడం వంటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు ఎప్పుడు వస్తుందో తెలియక గంటల తరబడి బస్టాప్‌ల వద్ద వేచి ఉండాల్సి వస్తోందని చెబుతున్నారు. కొందరు డ్రైవర్లు బస్టాప్‌లలో ప్రయాణికులు కనిపించినా బస్సులు ఆపడం లేదనే ఆరోపణలు కూడా పెరుగుతున్నాయి. మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

తెలంగాణలో కూడా ఇదే తరహా ఫిర్యాదులు తరచూ వినిపిస్తున్నాయి. మహాలక్ష్మి పథకం ప్రారంభమైన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో రద్దీ గణనీయంగా పెరిగింది. అయితే కొన్ని మార్గాల్లో సరిపడా బస్సులు లేకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగర ప్రాంతాల్లో బస్సులు ఆగకుండా వెళ్లిపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ సర్వీసులు నడపడం వంటి సమస్యలపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా రవాణా వ్యవస్థలో సిబ్బంది ప్రవర్తన కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కొందరు డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో సరిగా మాట్లాడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉచిత పథకాల కారణంగా రద్దీ పెరిగిందని చెబుతూ ప్రయాణికులపై అసహనం వ్యక్తం చేస్తున్న ఘటనలు కూడా బయటపడుతున్నాయి. దీంతో ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పథకాలపై ప్రజల్లో ప్రతికూల భావన ఏర్పడే ప్రమాదం ఉందని విశ్లేషకులు అంటున్నారు. ఆర్టీసీ సేవలు ప్రజల జీవితాల్లో కీలక భాగంగా మారాయి. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకు బస్సు ప్రయాణమే ప్రధాన ఆధారం. అలాంటి పరిస్థితుల్లో బస్సులు ఆగకపోవడం లేదా సమయానికి అందుబాటులో లేకపోవడం ప్రజల దైనందిన జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రభుత్వాలు పథకాలు ప్రవేశపెట్టడం మాత్రమే కాకుండా వాటి అమలుపై కూడా కఠినంగా పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజా రవాణా సేవలు మెరుగుపడితేనే ఉచిత బస్సు పథకాల అసలు లక్ష్యం నెరవేరుతుందని నిపుణులు చెబుతున్నారు. అవసరమైన చోట అదనపు బస్సులు ఏర్పాటు చేయడం, సిబ్బందికి బాధ్యతాయుత విధులపై శిక్షణ ఇవ్వడం, ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవడం వంటి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆర్టీసీ సేవల నాణ్యత పెంపుపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాల్సిన అవసరం మరింత స్పష్టంగా కనిపిస్తోంది.

## భవిష్యత్ సవాళ్లకు సిద్ధంగా ఉండాలి

➢ మొదటి పేజీ తరువాయి

ముందుకు సాగాలని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, వేగవంతమైన నిర్ణయాలు, సమన్వయంతో దేశ రక్షణ వ్యవస్థ మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా "ఆపరేషన్ సిందూర్" మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సైనిక నాయకత్వాన్ని రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. ఆపరేషన్ సిందూర్ భారత సాయుధ దళాల వేగవంతమైన, కచ్చితమైన చర్యలకు నిదర్శనమని కొనియాడారు.దేశ భద్రత విషయంలో భారత సైన్యం అత్యున్నత స్థాయి అప్రమత్తతతో పనిచేస్తోందని కేంద్ర మంత్రి అన్నారు. భవిష్యత్ యుద్ధ పరిస్థితులను ఎదుర్కొనేలా దళాలు సన్నద్ధంగా ఉండాలని సూచించారు.సైనిక ఆధునీకరణ, వ్యూహాత్మక ప్రణాళికలు, అంతర్జాతీయ పరిస్థితులపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. భారత సాయుధ దళాల సామర్థ్యం ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు పొందుతోందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

## మైనారిటీ విద్యార్థులకు ప్రత్యేక డిగ్రీ కళాశాలలు

శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ఈ ఆదేశాలు జారీ చేశారు. సంప్రదాయ కోర్సులకు మాత్రమే పరిమితం కాకుండా విద్యార్థుల జీవనోపాధికి ఉపయోగపడే శిక్షణ అందించాలని పేర్కొన్నారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందిస్తున్నట్లే ప్రతిభావంతులైన మైనారిటీ విద్యార్థులకు కూడా ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని సీఎం సూచించారు. ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల్లో ఎంపికైన మైనారిటీ అభ్యర్థుల్లో ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేసి మైనారిటీ సంక్షేమ శాఖలో బాధ్యతలు అప్పగించాలని సీఎం సూచించారు. శాఖ చేపట్టే కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగేలా వారిని తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహక కార్యక్రమాల్లో గ్రూప్స్‌లో ఎంపికైన అభ్యర్థులు, క్రీడాకారులను ఆహ్వానించి విద్య, క్రీడల ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. ఇమామ్‌లు, మౌజమ్‌లకు అందించే గౌరవ వేతనాలను క్రమం తప్పకుండా విడుదల చేయాలని అధికారులకు ఆదేశించారు.భూమి అందుబాటులో ఉన్న చోట ఖబర్‌స్తాన్‌లకు స్థలాలు కేటాయిస్తామని సీఎం తెలిపారు. డీజిల్, పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే రెట్రోఫిట్టింగ్ ప్రణాళిక ద్వారా ఆటోడ్రైవర్ల ఇంధన వ్యయాన్ని తగ్గించి వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో భాగంగా గుడి, మసీదు, చర్చి, గురుద్వారా నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భారత దేశ వైవిధ్య సంస్కృతిని, తెలంగాణ గంగా-జమునా తెహ్‌జీబ్ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా ఆ నిర్మాణాలు ఉండాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## చాహల్ వాపింగ్ కలకలం..

ఐపీఎల్ 2026 సీజన్ రసవత్తరంగా సాగుతున్న సమయంలో పంజాబ్ కింగ్స్ ( వెటరన్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ ఒక నెగటివ్ న్యూస్ తో హెడ్ లైన్స్ లోకి వచ్చాడు. విమాన ప్రయాణంలో చాహల్ వాపింగ్ చేస్తూ కనిపించాడనే వార్త ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. పంజాబ్ టీమ్ సభ్యులు అహ్మదాబాద్ నుండి హైదరాబాద్ వస్తున్న సమయంలో ఈ ఇన్సిడెంట్ జరిగినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో వస్తున్న వీడియోలు, ఫోటోలు చూసి ఫ్యాన్స్ షాక్ అవుతున్నారు. నిజానికి ఈ విషయం బయటకు రావడానికి టీమ్ మేట్ అర్ష్‌దీప్ సింగ్ కారణమయ్యాడు. అతను షూట్ చేసిన ఒక వ్లాగ్‌లో చాహల్ ఇ-సిగరెట్ వాడుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. పక్కనే శశాంక్ సింగ్ వంటి ఇతర ప్లేయర్లు కూడా ఉన్నారు. అయితే ఈ వీడియో వైరల్ అవ్వగానే, పంజాబ్ కింగ్స్ యాజమాన్యం లేదా అర్ష్‌దీప్ సింగ్ ఆ వీడియోను ఎడిట్ చేసి, చాహల్ ఉన్న సీన్లను కట్ చేసి మళ్ళీ అప్లోడ్ చేశారని నెటిజన్లు స్క్రీన్ షాట్లతో సహా నిరూపిస్తున్నారు. విమానంలో ఇలాంటి పనులు చేయడం తోటి ప్రయాణికుల భద్రతకు ముప్పు కలిగించడమేనని సోషల్ మీడియా యూజర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఐపీఎల్ 2026లో వాపింగ్ వివాదం రావడం ఇది రెండోసారి. కొన్ని రోజుల క్రితమే రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్, పంజాబ్ కింగ్స్ తో మ్యాచ్ జరుగుతున్న సమయంలో డ్రెస్సింగ్ రూమ్ లో వాపింగ్ చేస్తూ కెమెరాకు చిక్కాడు. ఆ విషయంలో బీసీసీఐ సీరియస్ అయ్యి, పరాగ్ మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించింది. ఇప్పుడు చాహల్ కూడా అదే తరహాలో దొరికిపోవడంతో క్రమశిక్షణపై చర్చ మొదలైంది.ఈ వివాదాలపై టీమిండియా సీనియర్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్ ద్వారా స్పందించాడు. ముఖ్యంగా రియాన్ పరాగ్ ఇన్సిడెంట్ ను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఇలాంటివి కెరీర్ కు అస్సలు మంచిది కాదని అన్నాడు. మీ పర్సనల్ లైఫ్ లో ఏం చేసినా ఎవరికీ అభ్యంతరం ఉండదని, కానీ ఒక పబ్లిక్ స్పేస్ లో ఉన్నప్పుడు, ముఖ్యంగా ఒక టీమ్ కు లీడర్ గా, ఎంతో మంది యువతకు ఇన్‌స్పిరేషన్ గా ఉన్నప్పుడు బాధ్యతగా ఉండాలని హితవు పలికాడు. ఇలాంటి చిన్న చిన్న తప్పుల వల్ల మొత్తం ఇమేజ్ డ్యామేజ్ అయ్యే ఛాన్స్ ఉందని అశ్విన్ హెచ్చరించాడు. ప్రస్తుతానికి ఈ వీడియోపై పంజాబ్ కింగ్స్ టీమ్ గానీ, చాహల్ గానీ ఎటువంటి స్టేట్మెంట్ ఇవ్వలేదు.

## మాజీ రక్షణ మంత్రులకు మరణశిక్ష

- అవినీతి కేసులో చైనా కోర్టు సంచలన తీర్పు
- లంచాల ఆరోపణలపై కఠిన చర్యలు
- జిన్‌పింగ్ అవినీతి వ్యతిరేక పోరుకు మరో మలుపు



బీజింగ్, మే 8: చైనాలో అవినీతి వ్యతిరేక చర్యలు మరింత కఠినంగా మారుతున్నాయి. దేశ మాజీ రక్షణ మంత్రులు వి ఫెంగీ, లీ షాంగ్‌ఫూకు చైనా మిలిటరీ కోర్టు మరణశిక్ష విధించడం అంతర్జాతీయంగా సంచలనంగా మారింది. అయితే రెండు సంవత్సరాల పాటు ఎటువంటి నేరానికి పాల్పడకుండా ఉంటే వారి శిక్షను జీవిత ఖైదుగా మార్చనున్నట్లు కోర్టు పేర్కొంది. అవినీతి కేసులో విచారణ అనంతరం ఈ తీర్పు వెలువడింది. వి ఫెంగీ లంచాలు తీసుకున్నట్లు, లీ షాంగ్‌ఫూ లంచాలు ఇచ్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో సాక్ష్యాధారాలు బలంగా ఉన్నాయని భావించిన కోర్టు కఠిన శిక్ష విధించినట్లు సమాచారం. చైనా రక్షణ వ్యవస్థలో ఉన్న అత్యున్నత స్థాయి అధికారులపై ఇలాంటి చర్యలు తీసుకోవడం అక్కడి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ 2014 నుంచి అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని తీవ్రంగా కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా సీనియర్ మిలిటరీ అధికారులు, రాజకీయ నేతలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక దర్యాప్తులు నిర్వహిస్తున్నారు. ఈ చర్యల్లో భాగంగా ఇప్పటికే పలువురు ఉన్నతాధికారులు పదవులు కోల్పోగా, మరికొందరు జైలుశిక్షలు ఎదుర్కొన్నారు.ఈ ఏడాది జనవరిలో చైనా మిలిటరీ నాయకత్వంలో కూడా భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. గతంలో 11 మంది సభ్యులతో శక్తివంతంగా ఉన్న సెంట్రల్ మిలిటరీ కమిషన్‌లో ప్రస్తుతం సభ్యుల సంఖ్య తగ్గినట్లు తెలుస్తోంది. జిన్‌పింగ్ తీసుకుంటున్న కఠిన నిర్ణయాలతో చైనా సైన్యంలో క్రమశిక్షణ పెరుగుతోందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అవినీతి వ్యతిరేక చర్యల కారణంగా జిన్‌పింగ్ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే మాజీ రక్షణ మంత్రులు వి ఫెంగీ, లీ షాంగ్‌ఫూలతో జిన్‌పింగ్‌కు రాజకీయ విభేదాలు ఉన్నాయా అన్న అంశంపై మాత్రం స్పష్టత లేదు. ప్రస్తుతం ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారి తీసింది.

## టీమిండియా టీ20 జట్టులో నాయకత్వ మార్పు!?

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) జాతీయ టీ20 జట్టులో కీలక నాయకత్వ మార్పుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో 2026 టీ20 ప్రపంచకప్ టైటిల్ టీమ్‌ఇండియా గెలిచినా.. తాజాగా ఐపీఎల్‌లో తాను ఫామ్ కోల్పోవడం వల్ల అతడ్ని ఆ బాధ్యతల నుంచి తప్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సీనియర్ ఆటగాడు ఇటీవల బ్యాటింగ్‌లో విఫలమవుతుండటంతో సెలక్షన్ కమిటీ ఆందోళన చెందుతున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. జాతీయ మీడియా నివేదిక ప్రకారం.. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ, సూర్యకుమార్ ఇటీవల పరుగులు చేయకపోవడంతో అతడ్ని పక్కకి పెట్టాలని యోచిస్తున్నట్లు సమాచారం అందుతోంది. అతడి స్థానంలో టీ20 జట్టుకు కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌ను ఎంపిక చేయాలని బీసీసీఐ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 తర్వాత జరిగే ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు అతడిని కెప్టెన్‌గా చేసే అవకాశం కూడా ఉంది. మరోవైపు సూర్యకుమార్ యాదవ్‌కు కెప్టెన్‌గా అద్భుతమైన రికార్డు ఉన్నప్పటికీ.. వ్యక్తిగత ప్రదర్శన క్షీణించింది. ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ తరపున పది మ్యాచ్‌లలో అతను కేవలం 195 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అదే విధంగా ఈ టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ మణికట్టు సమస్యతో బాధపడుతున్నట్లు.. అసౌకర్యంగా బ్యాటింగ్ చేస్తున్నట్లు నివేదికలు తెలిపాయి. ఈ క్రమంలో శ్రేయస్ అయ్యర్ ఫామ్‌లో ఉండడం సహా కెప్టెన్‌గానూ రాణిస్తుండడం వల్ల అతడ్ని టీ20 జట్టులోకి తీసుకొనే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

పంజాబ్ కింగ్స్ ఆడిన తొలి ఏడు మ్యాచ్‌లలో ఆరు విజయాలు సాధించడంలో జట్టుకు నాయకత్వం వహించి, తొమ్మిది ఇన్నింగ్స్‌లలో 333 పరుగులు సాధించాడు. అయితే ఈసారి టీ20 జట్టులోకి కొత్తదనాన్ని తీసుకురావాలని సెలెక్టర్లు చూస్తున్న తరుణంలో, అయ్యర్ నాయకత్వ లక్షణాలు, ఇటీవలి నిలకడ అతడిని ఆ పదవికి ప్రధాన పోటీదారుగా నిలిపాయని సమాచారం. కానీ, సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి టీమ్‌ఇండియా ఒక్క టీ20ఐ సిరీస్‌లో కూడా ఓడిపోకపోవడం ఒక ఆసక్తికరమైన పరిస్థితిగా మిగిలిపోయింది. అయితే, ఇప్పుడు కేవలం బ్యాటర్‌గా అతని స్థానమే పరిశీలనలో ఉంది. మరోవైపు, శ్రేయస్ అయ్యర్ డిసెంబర్ 2023 నుండి ఏ టీ20 మ్యాచ్‌లోనూ ఆడలేదు. ఈ భారీ మార్పు రాబోయే 2028 ఒలింపిక్ క్రీడలపై ప్రభావం ఉంటుందని బీసీసీఐ సెలక్షన్ టీమ్ భావిస్తుంది.

## సెన్సస్ - 2027లో సమన్వయంతో పనిచేయాలి : డీసీఓ భారతి హోళికేరి



**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు మే 8**
సెన్సస్- 2027 కార్యక్రమాన్ని ఎటువంటి పొరపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ (డీసీఓ) భారతి హోళీకేరి సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశంలో జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఛార్జ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెల్ఫ్ ఎన్యుమరేషన్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలని, డేటా నమోదు సమయంలో లోపాలు లేకుండా పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం పూర్తి చేసి వారికి సమగ్ర శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో సెన్సస్ ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఓ సంజీవరావు, మున్సిపల్ కమిషనర్ సుజాత తదితర అధికారులు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ ఎడ్ల వెంకటయ్య



**జఫర్గడ్ ప్రతినిధి, మే 8,(తరంగాలు):**
మండలం లోని రఘునాథ్పల్లి గ్రామం లో వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల సౌకర్యార్థం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ ఎడ్ల వెంకటయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో ఎవరూ దాహంతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రధాన కూడళ్లలో మంచినీటి సౌకర్యం కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసిన సర్పంచ్ శుభాష్



**జఫర్గడ్ ప్రతినిధి, మే 8, (తరంగాలు):**
ఉపాధి కూలీలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ సుభాష్ చంద్రబోస్ సూచించారు. మండలంలోని షాపెల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొన్న మహిళా కూలీలకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఉపాధి కూలీలు తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలో పని చేసే సమయంలో తరచూ నీరు తాగడం, తలపై గుడ్డ లేదా టోపీ ధరించడం, మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకోవడం, అవసరమైనప్పుడు ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం ద్వారా నీరసం, అలసట వంటి సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## పైపుల లీకులతో కలుషితమౌతున్న నీరు అరికట్టాలని కమిషనర్‌కు వామపక్షాల వినతి

**ఇల్లందు ప్రతినిధి మే 8, ( తరంగాలు):**



ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 23 వ వార్డులో మిషన్ భగీరథ ట్యాంక్ నుంచి వచ్చే మంచినీటి పైపులు లీక్ అయి నీరు కలుషితమౌతుందని, అలా జరగకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ చింత శ్రీకాంత్ కు వామపక్షాల నేతలు ఆర్బిజే రాజు, రాజరాం శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. సింగరేణి సిబ్బంది గోతులు తవ్వి విద్యుత్ ఎర్తులు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మరింత గోతులు అధికమవుతున్నాయి. ఈ గోతుల్లో పందులు బోర్లుతున్నాయి,దీని మూలంగా మంచి నీరు కలుషితం అవుతోందని వారు కమిషనర్ కు వివరించారు. మంచినీటి పైపుల లీకులతో కుళాయిలో నీరు కూడా సక్రమంగా రావడం లేదని, సమస్య పరిష్కరించి ప్రజలు రోగాల బారిన పడకుండా కాపాడాలని వారు కోరారు. స్పందించిన కమిషనర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# ధాన్యం కొనుగోలులో జాప్యం వద్దు - అధికారులకు కలెక్టర్ అంకిత్ ఆదేశాలు

- **సుజాతనగర్‌లో పీహెచ్‌సీ, ధాన్యం కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ**

**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ మే 8**
సుజాతనగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమగ్రంగా ఆరా తీశారు. మొదటగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ విభాగాలు, మందుల నిల్వ గది, సిబ్బంది హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. రోజువారీగా నమోదవుతున్న కేసుల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రక్తపరీక్షలు, ఇతర ల్యాబ్ సేవల నిర్వహణ, పరీక్షల ఫలితాల అందజేత విధానంపై ఆరా తీశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.



రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి కొనుగోలు పూర్తి చేయాలని, కేంద్రాల వద్ద రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితి రాకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతాన్ని స్వయంగా పరిశీలించిన కలెక్టర్, నాణ్యత ప్రమాణాలపై అధికారులను ప్రశ్నించారు. మొక్కజొన్న తరలింపునకు లారీలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే తగినన్ని లారీలు ఏర్పాటు చేసి రవాణా సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పి.ఆర్-126 రకం ధాన్యంలో "పిన్ పాయింట్ డ్యామేజ్" కారణంగా రైస్ మిల్లర్లు ధాన్యం స్వీకరించడం లేదని రైతులు వివరించగా, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.



రైతులు కష్టపడి పండించిన ధాన్యం ఎక్కడా నిల్వ ఉండకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించిన కలెక్టర్, కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తాగునీరు, తేమ కొలిచే పరికరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో భారతి, వైద్య అధికారి డాక్టర్ రమేష్, కొనుగోలు కేంద్రం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# అర్హులకు అందని ఇందిరమ్మ ఇల్లు

- **ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఇందిరమ్మ కమిటీ**
- **పక్షపాతిగా వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులు**
- **13 వార్డ్ కౌన్సిలర్ దండు సారయ్య**

**ఇల్లందు ప్రతినిధి మే 8, ( తరంగాలు):**
ఇల్లందు పట్టణ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 13 వార్డ్ కౌన్సిలర్ దండు సారయ్య మాట్లాడుతూ, ప్రజల చేత ఎన్నుకోబడిన 13వ వార్డు కౌన్సిలర్ అయినా నేను ప్రజలకు ఉపయోగపడే సూచనలు సూచిస్తున్న వాటిని పెడచెవిన పెడుతూ పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న పంపుల ఆపరేటర్, 13 వార్డు మున్సిపల్ ఆఫీసర్ నాకు వ్యతిరేకంగా పనిచేస్తూ,వార్డులో జరిగే కార్యక్రమాలకు ప్రోటోకాల్ పాటించకుండా పరిపాలనా అంశాలలో నన్ను పక్కన పెట్టే విధంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డులలోని పలు సమస్యలపై మున్సిపల్ కమిషనర్, చైర్మన్ దృష్టికి తీసుకపోవడం జరిగిందని తెలిపారు. నీళ్లు, కరెంట్, అలాగే అతి ప్రధానంగా నిరుపేదలైన అర్హులకు ఇందిరమ్మ ఇల్లు అందించకుండా ఇందిరమ్మ కమిటీ పేరుతో ఇష్టానుసారంగా వాళ్లకు నచ్చిన వారికి



ఇందిరమ్మ ఇల్లులు కేటాయిస్తుండటంపై ప్రశ్నించారు. వీరి వ్యవహార శైలిపై తక్షణ విచారణ జరిపించి తగిన శాఖాపరమైన చర్యలు తీసుకోవలిసిందిగా కోరారు. ఈ చర్యలన్ని కొంత మంది అధికారుల సహకారంతో నాకు తెలియకుండా దొంగ చాటుగా ప్రజల్లో నా గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు.అదే విదంగా నిన్న ది. 07 న జరిగిన మున్సిపల్ కార్యాలయంలో ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర సమక్షంలో కో-ఆప్షన్ సభ్యుడి భార్య నా 13వ వార్డుకు చెందిన ముగ్గురికి, ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను అధికారిక హటరీదాలో పంపిణీ చేయడం జరిగింది. ఇది పూర్తిగా ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్య అని పేర్కొన్నారు. ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధిని పక్కన పెట్టి, ఎలాంటి హోదా లేని వ్యక్తులను అధికార కార్యక్రమాల్లో ప్రోత్సాహించడం, ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధంగా ఉందన్నారు. అంతే కాకుండా 13 వార్డ్ ప్రజలు నన్ను గెలిపించినప్పటికి నాపై పెత్తనం చెలాయించాలనే ఆలోచన మేరకు ఇలా చేస్తున్నారని మండిపడ్డారు.వారి ప్రధాన అనుచరుల వల్ల రాజకీయంగా, సామాజికంగా, వ్యక్తిగతంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని తెలిపారు. ప్రజల చేత ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కౌన్సిలర్ హక్కులను రక్షించే లా ఉండాలని అన్నారు. 13వ వార్డు కౌన్సిలర్ గా నాకు తెలియపరుస్తూ వార్డులో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించాలని లేనిపక్షంలో తగు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ అధికారుల పక్షపాతి దోరణిపై శాఖాపరమైన విచారణ చేపట్టాలని, రాజకీయ ప్రభావంతో వ్యవరిస్తున్న కౌంట్రాక్టు ఉద్యోగులపై,13వ వార్డు మున్సిపల్ ఆఫీసర్ వ్యవహార శైలిపై విచారణ జరిపించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో 13వ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## జక్కేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా ఎస్సీమహిళ

- **కోర్టు తీర్పుతో దక్కిన అవకాశం**

**పాలేరు ఆర్సీ, మే 8 (తరంగాలు) :**
జక్కేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పదవి దళిత మహిళకు దక్కడం గ్రామంలో కీలక పరిణామంగా మారింది. ఈ సంఘానికి గతంలో కొత్త రాజిరెడ్డి, కళ్లెం శేషిరెడ్డి, నల్లబోలు చంద్రారెడ్డి, కొత్త అంజిరెడ్డి, పగడాల చంద్రారెడ్డి, యానాల చినలింగారెడ్డి వంటి ప్రముఖులు నాయకత్వం వహించారు. అలాంటి చరిత్ర ఉన్న సంస్థలో ఎస్సీ మహిళకు అవకాశం రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వివరాల్లోకి వెళితే ఇటీవల జరిగిన జక్కేపల్లి సర్పంచ్ ఎన్నికల్లో నల్లబోలు చంద్రారెడ్డి గెలుపొందడంతో, సర్పంచ్ బాధ్యతలు కొనసాగించేందుకు సొసైటీ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. అనంతరం ప్రభుత్వం సహకార సంఘాలను రద్దు చేయగా, రైతు సంఘాలు హైకోర్టును ఆశ్రయించాయి. కోర్టు నిర్ణయంతో సంఘాలు తిరిగి పునరుద్ధరించబడ్డాయి. ఈ పరిస్థితుల్లో ఖాళీ అయిన చైర్మన్ పదవికి వైస్ చైర్మన్‌గా ఉన్న



దళిత మహిళ దారా జయశ్రీని చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అలాగే వైస్ చైర్మన్ గా రామిని వీరభద్రారెడ్డిని నియమించారు. ఈ నిర్ణయంతో నామినేటెడ్ పదవులు ఆశించిన వారికి నిరాశ ఎదురైంది. అయితే దళిత మహిళకు ఈ అవకాశం రావడం పట్ల జక్కేపల్లి రైతులు అభినందనలు తెలిపారు. సొసైటీని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. గతంలో ఇదే సొసైటీకి నల్లబోలు చంద్రారెడ్డిని ఏకగ్రీవంగా చైర్మన్‌గా ఎన్నుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా చైర్మన్ గా ఎన్నికైన దారా జయశ్రీ మాట్లాడుతూ.. నన్ను డైరెక్టర్‌గా గెలిపించి, వైస్ చైర్మన్‌గా నియమించి, ఇప్పుడు చైర్మన్‌గా అవకాశం కల్పించిన నల్లబోలు చంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. సొసైటీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు.

## మెగా పశు వైద్యశిబిరం విజయవంతం

- ముఖ్య అతిథిగా హాజరైన జేడీ బీ పురంధర్



**పాలేరు ఆర్సీ, మే 8 (తరంగాలు) :**
కూసుమంచి మండలంలోని మల్లేపల్లి గ్రామంలో శుక్రవారం మండల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మెగా పశువైద్య శిబిరం నిర్వహించినట్లు మండల పశు వైద్యాధికారి ఆర్ నీలకాంత్ తెలిపారు. ఈ శిబిరం ప్రారంభోత్సవానికి జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి బీ పురందర్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ శిబిరాన్ని మల్లేపల్లి గ్రామ సర్పంచ్ తెల్లమేకల భవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భవిత మాట్లాడుతూ రైతులు, పశుపోషకులు ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువులకు సీజనల్ గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99రోజుల ప్రణాళిలో భాగంగా ఏర్పాటు చేస్తున్న రైతువారోత్సవాలలో భాగంగా ఈ శిబిరం నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి బి పురంధర్ మాట్లాడుతూ రైతులకు పశుపోషణలో మెళకువలు, వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నీలకాంత్ మాట్లాడుతూ ఈ శిబిరంలో మొత్తం 194 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, 121 దూడలకి నట్టల మందు తాగించడం, 21 సాధారణ చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, జీళ్లచెరువు పశువైద్యాధికారి డాక్టర్ టి ఉషశ్రీ, కూసుమంచి, పాలేరు, జక్కేపల్లి, ఈశ్వరమాదారం సిబ్బంది కె స్వరూప, పి శ్రీనివాసరావు, ఎండీ.హమీద్ పాష, గోపాలమిత్రులు బి భాస్కర్ రెడ్డి, కె లక్ష్మారెడ్డి, పి గోపి, కె.ఎన్.చారి, పి మల్సూరు, సీహెచ్ ఉపేందర్, తుడుం వీరబాబు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ఎమ్మెల్యే క్యాం కార్యాలయం ఇన్చార్జి భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి

**పాలేరు ఆర్సీ,08( తరంగాలు)**



పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలం లింగారం తండా గ్రామ పంచాయతీ శివారు గన్యా తండా లో తాగునీటి సమస్యను గురించి సర్పంచ్ బానోత్ పుష్ప--రవి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ద్వారా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వెంటనే స్పందించిన రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి లింగారం తండా కు గన్యా తండ కు బోరు మోటార్ కు కరెంటు స్తంభాలు వేయించి విద్యుత్ సరఫరాను అందించడం జరిగింది. గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించినందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసినారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కి, స్థానిక సర్పంచ్ బానోత్ పుష్ప రవి, ఉప సర్పంచ్ గుగులోత్ వేణు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఈగ మల్లేశం



**వరంగల్ ప్రతినిధి, మే 8, తరంగాలు :**
నూతన వధూవరులను కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ఆశీర్వదించారు. వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలో గల ఆకుతోట కన్వెన్షన్ హాల్ లో జరిగిన బేతి అరుణ - మల్లేశం కుమారుడు విక్రమ్ - మధుమిత వివాహ మహోత్సవానికి కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ కార్యక్రమంలో అబ్బు ప్రకాష్ రెడ్డి, బేతి వెంకన్న, సారంగపాణి, రాజు, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



# బాలవికాస ఆధ్వర్యంలో ఆదర్శ గ్రామ నిర్మాణానికై గ్రామ నాయకులతో సమావేశం




**జఫర్గడ్ ప్రతినిధి,మే 8, (తరంగాలు):**
మండలంలోని సాగరం గ్రామంలో 30 మంది సభ్యుల నాయకులతో ఆదర్శ గ్రామ నిర్మాణం పై సమావేశం ఏర్పాటు చేశారు. బాలవికాస గత 40 సంవత్సరాలుగా తెలంగాణలో కాక ఎనిమిది రాష్ట్రాల్లో పలు గ్రామాభివృద్ధి పథకాలు ప్రారంభించి వాటిని కొనసాగిస్తూ లక్షలాది మందికి లబ్ధిని చేకూరుస్తుంది గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఒక్కరితో సాధ్యం కాదని గ్రామ పౌరులందరూ గ్రామాలలో మార్పు సాధ్యమవుతుందని సూచించారు గ్రామాలలో స్థిరమైన మార్పు కొరకు నాయకులంతా కలిసి పనిచేయాలని ప్రజలను కలుపుకొని గ్రామాభివృద్ధి ని సాధించాలని ఒక్కరుగా చేయలేనిది అందరు కలిసి చేస్తే సాధ్యమవుతుంది గ్రామం ఆదర్శ గ్రామం మారాలంటే నాయకులంతా ఐక్యమత్యంతో పార్టీలకు కులమత వర్గాలకు అతీతంగా కలిసి పనిచేయాలి గ్రామం మనది బాధ్యత మనదే అనే ఉద్దేశంతో ప్రజలలో అవగాహన పెంచుతూ చైతన్యం పెంచవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆదర్శ గ్రామ నిర్మాణ పథకం మేనేజర్ మంజుల చెప్పారని సమస్త ప్రతినిధి ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె రాజకుమార్ పై రాకేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తాటికాయల మమత చైతన్ మాట్లాడుతూ సమస్త మా గ్రామాన్ని దత్తత తీసుకున్నందుకు మాకు సంతోషంగా ఉందని మా గ్రామంలోని ప్రతి వీధిలో నుండి ఈ పథకంలో భాగస్వాములు అయ్యేవిధంగా చూసుకుంటామని తెలిపారు. గ్రామపంచాయతీ నుండి పూర్తి సహకారం అందజేస్తామని గ్రామ సభకు ప్రతి కుటుంబం కనీసం ఒక్కరైనా హాజరు కావడానికి ప్రయత్నం చేస్తామని ప్రజలందరినీ కలుపుకొని మార్పు దిశగా అడుగులు వేస్తామని తెలిపారు.అలాగే ఉప సర్పంచ్ కత్తుల సుమన్ మాట్లాడుతూ సమస్త మా గ్రామానికి ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుంటామని అందరం కలిసి ఊరు కోసం పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాటికాయల మమత చేతన్ , ఉపసర్పంచ్ కత్తుల సుమన్ , వార్డు సభ్యులు,అన్ని పార్టీల నాయకులు, గ్రామ కార్యదర్శి, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ అన్ని కుల సంఘాల గ్రామ పెద్దలు,సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యరైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి





**పాలేరు ఆర్సీ, మే 8 (తరంగాలు) :**
మత్స్య పరిశోధన స్థానం, పాలేరు, పి.వి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయము హైదరాబాదు వారి ఆధ్వర్యంలో, మత్స్య శాఖ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదు వారి సహకారంతో, భారతీయ వ్యవసాయ, పరిశోధన మండలి, న్యూఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో, తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్, షెడ్యూల్డ్ క్యాస్ట్ మత్స్య కారులకు జరుగుతున్న జలాశయాలలో చేపల పెంపకం, యాజమాన్య పద్ధతులు అను అంశంపై 3 రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం 2వ రోజు శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, ఖమ్మం జిల్లాల నుంచి 25 మంది మత్స్యకారులు హాజరైనట్లు పాలేరు మత్స్య పరిశోధన స్థానం అధిపతి శ్యాంకుమార్ తెలిపారు. ఈ సదర్భంగా రైతులను ఉద్దేశించి శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. దడీలలో (కంచెలలో) చేపల పెంపకం చేసేటప్పుడు స్థల ఎంపిక గురించి, దడి నిర్మాణం గురించి, కంచె నిర్మాణం గురించి, కంచెలలో చేపల పెంపకంలో పాటించవలసిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.

# ప్రతి ఒక్కరూ స్వీయ గణన కార్యక్రమంలో పాల్గొనాలి

- క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం
- నూతన మెడికల్ కాలేజ్ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి
- పంట మార్పిడి విధానం, సేంద్రియ ఎరువుల వాడకం నేచురల్ వ్యవసాయంపై రైతులు ముందుకు రావాలి
- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్



**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మే.08, తరంగాలు:**
స్వీయ గణన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పాల్గొని వారి యొక్క వివరాలను నమోదు చేసుకోవాలని, తద్వారా దేశ అభివృద్ధికి తోడ్పాటు అందించినట్లు అవుతుందని జనాభా గణన కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఒక్కరూ పాల్గొని వారి యొక్క ఐడిని పొందాలని సూచించారు, క్షేత్రస్థాయిలో ఇప్పటికే అన్ని విభాగాలలో ప్రభుత్వ ప్రైవేటు ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ తదితర ఉద్యోగస్తులు తమ వివరాలను నమోదు చేసుకున్నారని, మరింత విస్తృత ప్రచారం కల్పించడం కోసం శుక్రవారం స్వీయ జనన ప్రచార రథం ప్రారంభించడం జరిగిందని అన్నారు,ఆడియో, వీడియో, వివిధ సామాజిక మాధ్యమాలు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఈ జన గణన పై విస్తృత అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని కోరారు, బ్యాంకింగ్ రంగ వ్యవస్థ సామాజిక బాధ్యతగా రైతులకు అండగా ఉండేందుకు కృషి చేయాలని అందులో భాగంగానే గూడూరు మండల కేంద్రంలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ పరికరాలను అందించడం జరుగుతుందన్నారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు శ్రీ హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం రైతుల ఆర్థిక అభివృద్ధి కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు



పరుస్తుందని ప్రతి ఒక్క రైతు వారి హక్కుగా భావించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలయ్యే పథకాన్ని వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు,జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం పంట మార్పిడి విధానం, అంతర్ పంటలు పామ్ ఆయిల్, కూరగాయలు, తదితర వాణిజ్య, మిల్లెట్స్,పంటలు ద్వారా రైతులు అధిక లాభాలు పొందుతున్నారని ఆ దిశగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించి పంటలు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు సేంద్రియ ఎరువుల వాడకం, నేచురల్ వ్యవసాయం, తెలియపరచాలని, అధికంగా యూరియా వాడకం వలన భూసారం దెబ్బతింటుందన్నారు, నానో యూరియా పై రైతులు అవగాహన పెంచుకోవాలని అన్నారు,ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం రవీంద్రబాబు, కమలాకర్, ఏ.రవి, రమేష్, విజయ్ కుమార్, గూడూరు సర్పంచ్ సునీత కుమార్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహబూబాబాద్ పట్టణంలోని నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజ్ భవనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు, ఇప్పటికే దాదాపుగా పూర్తి అయిన భవనం యొక్క పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి సిద్ధం చేయాలని తెలిపారు

అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీరు, విద్యుత్ సరఫరా, తదితర పనులు పూర్తి కావడంతో మిగిలిన చిన్న చిన్న వర్కులను తక్షణమే పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు, ఈ కార్యక్రమాలలో కలెక్టర్ వెంట సిపిఓ శ్రీనివాసరావు, డి పి ఆర్ ఓ రాజేంద్రప్రసాద్, వెటర్నరీ జిల్లా అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారిని సరిత, ఉద్యాన వన శాఖ అధికారి జి. మరియన్న, ఏ డి ఏ శ్రీనివాసరావు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట్ లకావత్, ఆర్ అండ్ బి ఈ ఈ, తదితరులు పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS

శనివారం, 09 మే, 2026

జాతీయ దిన పత్రిక

తరంగాలు

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన ఏసీపి నరసయ్య



**జఫర్గడ్ ప్రతినిధి,మే 8,( తరంగాలు):** మండలంలోని తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వర్ధన్నపేట ఏసీబీ నరసయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు . అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. రైతులకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సమ్మయ్య,ఎస్సై రామారావు , అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రాజమౌళికి ఎస్సైగా ప్రమోషన్



**జఫర్గడ్ ప్రతినిధి, మే 8, ( తరంగాలు):** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ గావిధులు నిర్వహిస్తున్న రాజమౌళి ఎస్సైగా ప్రమోషన్ లభించింది శుక్రవారం కమిషనర్ కార్యాలయంలో జిల్లా కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఎస్సైగా రాజమౌళి కి ఉత్తర్వులు అందజేశారు. రాజమౌళి పోలీస్ శాఖలో కానిస్టేబుల్ గా ఉద్యోగం పొంది అంకితభావంతో విధులు నిర్వహిస్తూ అంచలంచలుగా పదోన్నతులుగా పొంది ఎస్సైగా ఎదిగారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరి సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు పదోన్నతి రావడం ఎంతో ఆనందంగా ఉందని ఉన్నత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు కాగా రాజమౌళి ఎస్సైగా పదోన్నతి పొందడం పట్ల పలువురు మిత్రులు బంధువులు పోలీస్ శాఖ ఉద్యోగులు ఆయనను అభినందించారు.

# వంతెన నిర్మాణం పూర్తి... రహదారి పనులు గాలికే..!

- సింగరేణి గేట్ వద్ద ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారిన నిర్లక్ష్యం
- రోడ్డు పక్కన మట్టి లేదు... ప్రజల ప్రాణాలకు విలువ లేదా..?
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదాల బాటలో సింగరేణి-పేరుపల్లి రహదారి
- అదే గుత్తేదారుకు మళ్లీ పనులా..? స్థానికుల్లో అనుమానాలు
- సింగరేణి గేట్ వద్ద ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్న నిర్లక్ష్యం



**కారేపల్లి టౌన్ తరంగాలు న్యూస్ మే 8** సింగరేణి నుండి పేరుపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై సింగరేణి గేట్ ముందు ఇటీవల చిన్న వంతెన నిర్మించినప్పటికీ, వంతెనకు ఇరువైపులా ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెన నిర్మాణం పూర్తయిన తర్వాత రహదారి అంచుల్లో కనీసం మట్టి కూడా నింపకపోవడంతో వాహనదారులు ప్రమాద భయంతో ప్రయాణం సాగిస్తున్నారు. ప్రత్యేకంగా రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు, కార్లు మరియు ఇతర వాహనాలు నడిపే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రహదారి పక్క భాగాలు అసమతుల్యంగా ఉండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. స్థానికుల ఆరోపణల ప్రకారం, ఈ పరిస్థితి రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులకు కనిపించకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని అంటున్నారు. ఇదిలా ఉండగా, గతంలో ఇదే గుత్తేదారు చేపట్టిన రహదారి నిర్మాణ పనులపైనా నాణ్యత లోపాల ఆరోపణలు ఉన్నాయని సమాచారం. అలాంటి పరిస్థితుల్లో తిరిగి అదే కాంట్రాక్టర్‌కు వంతెన నిర్మాణ పనులు అప్పగించడంపై స్థానిక ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై జిల్లా రోడ్లు భవనాల శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి విచారణ చేపట్టి, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక ప్రత్యేక విద్య వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మే. 08, తరంగాలు:** శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారి, ఇంటర్మీడియట్ అధికారి, అన్ని మండల విద్యాశాఖ అధికారులతో కలసి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, మే 11 నుండి 17 వరకు జరిగే ప్రత్యేక విద్య వారోత్సవాల నిర్వహణ, విద్యాశాఖ పై జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, సమీక్షా సమావేశం నిర్వహించారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక విద్య వారోత్సవాల నిర్వహణ కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు, 1వ రోజు ప్రారంభోత్సవాలు మైనర్ రిపేర్లు చేపట్టిన వసతుల ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు, సమ్మర్ క్యాంపు ల నిర్వహణ, పీఎం శ్రీ పాఠశాలల్లో క్యాంపులు ఏర్పాటు, 2, రోజు పదవ తరగతి, ఇంటర్మీడియట్ రీమెడియన్ క్యాంపుల నిర్వహణ, ప్రతి సబ్జెక్టు వారీగా నిపుణుల చేత బోధనలు, హాజరు శాతం పర్యవేక్షణ పురోగతిపై సమీక్ష మధ్యాహ్న భోజనం అందించుట, ఏడిస్తాయి అధికారి చేత పర్యవేక్షణ కార్యక్రమాలు,3,వరోజు సర్పంచులతో పాఠశాల విద్యా కార్యక్రమాలపై వర్క్ షాప్, మండల స్థాయిలో కార్యక్రమాలు, డిజిటల్ ప్రచారం, 4వ రోజు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం, ర్యాలీలు, తల్లిదండ్రుల సమావేశాలు, పూర్వ విద్యార్థుల సమావేశాలు, 5వ రోజు గ్రంథాలయ దినోత్సవం, పుస్తక ప్రదర్శనలు, ఉత్తమ పాఠకుల గుర్తింపు, బుక్ టాక్ కార్యక్రమాలు, పుస్తకాల పంపిణీ శిబిరాలు, 6వ రోజు కలలు హస్తకళలు సంస్కృతిక దినోత్సవ కార్యక్రమాలు, చిత్రలేఖనం, హస్తకళలు, కోలాటం, ఒగ్గు కథ, సాంప్రదాయ కళా ప్రదర్శనలు, దివ్యాంగ విద్యార్థుల కళాఖండాల ప్రదర్శన, ఉత్తమ విద్యార్థుల గుర్తింపు సన్మానం, 7వ రోజు విద్య విజయోత్సవ దినోత్సవం , విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మాన కార్యక్రమాలు, ప్రతి విభాగానికి సంబంధించి ముగ్గురు టాపర్లను పురస్కారం, ప్రజా ప్రతినిధులు అధికారులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ ప్రాధాన్యత ఇవ్వాలని, షెడ్యూల్ ప్రకారం నిర్వహించే ప్రతి కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలని, ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేసి విజయవంతంగా కార్యక్రమాలను నిర్వహించాలని, కార్యక్రమాలకు సంబంధించి వీడియో ఫోటో డాక్యుమెంటరీ రెడీ చేయాలన్నారు, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియం తో పాటు ఇంగ్లీష్ మీడియం కు ప్రాధాన్యత కల్పిస్తూ విద్యార్థులకు ఇంగ్లీష్ భాష పై పట్టు వచ్చే విధంగా మాట్లాడాలని తద్వారా వారి భవిష్యత్తుకు కార్యచరణ ప్రణాళికా ప్రకారం నిర్వహించడం జరుగుతుందని అన్నారు, పీఎం శ్రీ పాఠశాలల లో ఉన్న విధంగా ప్రతి పాఠశాలలో క్రమశిక్షణ పట్టుదల ప్రతి సబ్జెక్టు పై నాలెడ్జ్ తో కూడిన, నూతన టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను అందించాలని సూచించారు కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారుల అభిప్రాయాలను తెలుసుకుని సుదీర్ఘంగా సమావేశం నిర్వహించిన కలెక్టర్,ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, ఇంటర్మీడియట్ అధికారి మదర్, విద్యాశాఖ ప్లానింగ్ ఏసీజీ విభాగాల అధికారులు శ్రీరాములు, అప్పారావు, పూర్ణచందర్, సంతోష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పరపల్లిలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఏర్పాటు

- నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం - ఎస్సై క్రాంతి కిరణ్



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మే.08, తరంగాలు :** మహబూబాబాద్ జిల్లా ఉప్పరపల్లి గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా గ్రామ సర్పంచ్ ఎర్రుల సునిత కుమరస్వామి ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాల ఏర్పాటు కార్యక్రమంలో ఎస్సై క్రాంతి కిరణ్ సర్పంచ్ ఎర్రుల సునీత కుమారస్వామి , గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, ముఖ్యమైన ప్రాంతాల్లోఆరు కెమెరాలు అమర్చినట్లు వాటి విలువ సుమారు 85000/-నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై క్రాంతి కిరణ్ మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చు. దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించడంతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కూడా ఇవి ఉపయోగపడతాయి.

గ్రామాభివృద్ధికి సర్పంచ్ తీసుకున్న ఈ చర్య అభినందనీయం. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలి అని పిలుపునిచ్చారు. గ్రామస్తులు కూడా సీసీ కెమెరాల ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. 24 గంటల నిఘాతో గ్రామంలో భద్రత పెరుగుతుందని, ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కుండే బాల కుమార్, బోనగిరి రమేష్, మంద ప్రవీణ్ గ్రామ పెద్దలు సంకు శ్రీనివాస్ రెడ్డి ఎసల్ల సత్యనారాయణ పర్కాల మురళి, సుధ గాని విజేందర్, మంచాల కుమారస్వామి, కారోబార్ కంచ కట్టయ్య పబ్బతి నర్సింహా రావు , మద్ది దేవెంధర్ బండారు రాజుకుమార్, ఏర్రుల కృష్ణ మహేందర్ తదితరులు పాల్గొన్నారు

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ మాటల్లో మాత్రమేనా...?

- బీసీ హక్కుల కోసం గొంతెత్తినందుకే నాపై రాజ్యాంగ విరుద్ధ సస్పెన్షన్ - పెరుమాండ్ల చరణ్ గౌడ్



**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, మే.08,తరంగాలు:** మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నియామకంలో బీసీ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని, కాంగ్రెస్ పార్టీ కోసం 2011 నుండి నిరంతరం పోరాడుతున్న ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలని శాంతియుతంగా డిమాండ్ చేసినందుకు నాపై భారత యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పదవి నుండి ఎటువంటి కారణాలు చూపకుండా, వివరణ కోరకుండా, అంతర్గత విచారణ నిర్వహించకుండా సస్పెన్షన్ విధించడం పూర్తిగా ప్రజాస్వామ్య విరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం అని పెరుమాండ్ల చరణ్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సభల్లో బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేస్తామని, బీసీ యువతకు రాజకీయంగా అవకాశాలు కల్పిస్తామని, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు గౌరవం ఇస్తామని ప్రకటించారు. కానీ నేడు వాస్తవ పరిస్థితుల్లో మాత్రం బీసీ వర్గాలకు న్యాయం జరగడం లేదు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో బీసీ యువతకు అవకాశాలు దక్కడం లేదు. పార్టీ కోసం కష్టపడిన అనుబంధ సంఘాల కార్యకర్తలను పక్కన పెట్టి, చివరి నిమిషంలో వచ్చిన వారికి పదవులు ఇవ్వడం బాధాకరం అని అన్నారు.నేను 2011 నుండి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను నమ్మి గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కోసం ఎన్నో పోరాటాలు చేశాను. ఎన్ఎస్‌యూఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాను. బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై, కేంద్ర బీజేపీ ప్రభుత్వ నిరంకుశ నిర్ణయాలపై హైదరాబాద్ నుండి ఢిల్లీ వరకు అనేక నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. పార్టీ కోసం లాఠీ దెబ్బలు తిన్నాను, కేసులు ఎదుర్కొన్నాను, కానీ కాంగ్రెస్ సిద్ధాంతాలపై నమ్మకం కోల్పోలేదు అని గుర్తుచేశారు.మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నియామకంపై నేను చేసిన నిరసన పూర్తిగా శాంతియుతం, ప్రజాస్వామ్యబద్ధమైనది. బీసీ సమాజానికి న్యాయం చేయాలని, పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలు కష్టపడ్డ ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ కార్యకర్తలకు అవకాశాలు ఇవ్వాలని మాత్రమే డిమాండ్ చేశాను. కానీ దానికి ప్రతిఫలంగా నాపై సస్పెన్షన్ విధించడం బీసీ సమాజాన్ని అణచివేయడమే అని మండిపడ్డారు. ఈ ఘటన ఒక వ్యక్తిపై జరిగిన అన్యాయం మాత్రమే కాదు. బీసీలకు 42% రిజర్వేషన్ అని చెప్పే నాయకత్వం వాస్తవానికి బీసీ యువత గొంతును ఎంతవరకు అణచివేస్తుందో చూపించే ఉదాహరణ. బీసీ హక్కుల కోసం ప్రశ్నిస్తే పదవులు తీసేస్తారా? పార్టీ కోసం 15 సంవత్సరాలు కష్టపడిన కార్యకర్తలకు ఇదేనా గౌరవం అనే ప్రశ్నలు ఇప్పుడు కాంగ్రెస్ కార్యకర్తలలో, ముఖ్యంగా బీసీ యువతలో తీవ్రంగా వినిపిస్తున్నాయని అన్నారు. అందువల్ల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మరియు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ వెంటనే ఈ విషయంపై జోక్యం చేసుకుని, బీసీ సమాజానికి న్యాయం చేయడంతో పాటు తన పై విధించిన సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని వినమ్రంగా విజ్ఞప్తి చేశారు.బీసీలకు న్యాయం జరిగే వరకు, కాంగ్రెస్ సిద్ధాంతాలను కాపాడే కార్యకర్తలకు గౌరవం దక్కే వరకు నా పోరాటం కొనసాగుతుంది అని స్పష్టం చేశారు.

## మొక్కజొన్న రైతుల ఆర్తనాదం వినిపించదా..?

- వెంటనే కొనుగోలు కేంద్రాలు పెంచకపోతే రైతాంగం రోడ్డున పడుతుంది :
- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామాల సత్యం



**ఖమ్మం జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ మే 8**

అకాల వర్షాలు, ఈదురుగాలులు, వడగళ్ల వానలతో తెలంగాణ రాష్ట్రంలో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా మొక్కజొన్న మరియు ధాన్యం రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామాల సత్యం ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటను అమ్ముకునే పరిస్థితి లేక గోదాముల ఎదుట, కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సరిపడా కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు దూర ప్రాంతాలకు పంటను తరలించాల్సి వస్తోందని, దీనివల్ల రవాణా ఖర్చులు పెరిగి రైతులపై అదనపు భారం పడుతోందన్నారు. ఇప్పటికే ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతులు ఇప్పుడు మార్కెట్‌లో సరైన ధరలు లేక మరింత ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల సమస్యలను అత్యవసరంగా పరిగణనలోకి తీసుకొని ప్రతి మండలంలో అదనపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతులు తీసుకొచ్చిన ధాన్యం మరియు మొక్కజొన్నను తక్షణమే కొనుగోలు చేసేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని దామాల సత్యం కోరారు. రైతుల పంట తడిసిపోవడం వల్ల నాణ్యత తగ్గిందనే పేరుతో కొనుగోళ్లను నిరాకరించడం అన్యాయమని, ప్రభుత్వం ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని అన్నారు. రైతు కష్టానికి సరైన గౌరవం ఇవ్వకుండా ఆలస్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా రైతాంగ ఆందోళనలు మరింత ఉధృతమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. రైతు బతికితేనే దేశం బతుకుతుందని, రైతాంగాన్ని ఆదుకోవడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని దామాల సత్యం స్పష్టం చేశారు. తెలంగాణలో రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో భయ్యన వీరబాబు వరద సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు

## ఓటముల నుంచి లక్నోకు భారీ ఊరట

ఓటముల్లో రికార్డులు నమోదు చేసిన లక్నో సూపర్ జియాంట్స్ అద్భుతం చేసింది. టాప్‌లో ఉన్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు భారీ షాక్ ఇచ్చింది. ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన పంత్ సేన మ్యాచ్‌ను సొంతం చేసుకుని వరుస ఓటములకు బ్రేక్ ఇచ్చింది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో బెంగళూరు తీవ్రంగా శ్రమించినా ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది. 9 పరుగుల తేడాతో లక్నో విజయం సాధించి హ్యాట్రిక్ ఓటముల నుంచి ఊరట పొందింది.పలుమార్లు వర్షం అంతరాయంతో ఆలస్యంగా జరిగిన ఈ మ్యాచ్‌ను 19 ఓవర్లకు కుదించగా.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జియాంట్స్ 3 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. మిచెల్ మార్ష్ అద్భుతమైన సెంచరీతో అద్భుతం చేయగా.. అర్షిన్ కులకర్ణి 17 పరుగులు నమోదు చేశాడు. వర్షం పడినా.. పిచ్ ఎలా మారినా కూడా మార్ష్ మాత్రం చెలరేగి ఆడాడు. 56 బంతుల్లో 111 పరుగులు చేసి దుమ్మురేపగా.. వాటిలో 9 బౌండరీలు, 9 సిక్సర్లు బాదాడు. నికోలస్ పూరన్ 38, కెప్టెన్ రిషబ్ పంత్ 32 పరుగులతో రాణించి ప్రత్యర్థికి భారీ స్కోర్‌ను లక్ష్యం విధించారు. లక్నో స్కోర్‌ను కట్టడి చేయడంలో బెంగళూరు బౌలర్లు కొంత తడబడ్డారు. జోష్ హేజిల్‌వుడ్, కృనాల్ పాండ్యా, రసిక్ సలామ్ తలా ఒక్కో వికెట్ తీయగా.. మిగతా బౌలర్లు వికెట్ పడగొట్టడంలో విఫలమయ్యారు.టాపార్డర్ చేతులెత్తేసిన వేళ మిడిలార్డర్ గొప్పగా పోరాడంతో 19 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయిన బెంగళూరు 7 పరుగుల స్వల్ప తేడాతో మ్యాచ్‌ను చేజార్చుకుంది. జాకోబ్ బెతెల్ 4 పరుగులకు ఔటవగా.. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ డకౌట్ అవడంతో బెంగళూరు కష్టాల్లో పడింది. ఓపెనర్లు వెనుదిరిగిన వేళ దేవదత్ పడిక్కల్, కెప్టెన్ రజత్ పాటిదార్ అద్భుతంగా ఆడి స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. పడిక్కల్ 34 పరుగులతో రాణించగా.. రజత్ 31 బంతుల్లో 61 స్కోర్ చేసి సత్తా చాటాడు. జితేశ్ శర్మ ఒక్క పరుగు మాత్రమే చేయగా.. టిమ్ డేవిడ్ గొప్పగా పోరాడి 40 పరుగులు తీశాడు. విజయం కోసం కృనాల్ పాండ్యా (28లి), రొమారియో షెఫర్డ్ (23లి) ఆఖరి బంతి వరకు పోరాటం చేశారు. ఒక దశలో గెలిచేస్తారనుకున్న సమయంలో బౌలర్లు కట్టడి చేయడంతో పరుగులు రాలేకపోయాయి. ఫలితంగా బెంగళూరు మ్యాచ్‌ను కోల్పోవాల్సి వచ్చింది. లక్నో బౌలర్లు ప్రారంభంలో అద్భుతంగా బౌలింగ్ చేయగా.. తర్వాత దాన్ని కొనసాగించలేకపోయారు.యువ బౌలర్ ప్రిన్స్ యాదవ్ అద్భుతంగా బంతులు వేసి కీలకమైన మూడు వికెట్లు తీశాడు. షాబాజ్ అహ్మద్ రెండు వికెట్లతో సత్తా చాటగా.. సీనియర్ బౌలర్ షమీ ఒక వికెట్ తీశాడు. వరుస వికెట్లు తీసిన అనంతరం మిగతా వికెట్లు తీయడంలో తడబడడమే కాకుండా స్కోర్‌ను కూడా నియంత్రించలేకపోయారు. ఫలితంగా ఓవర్లన్నీ ముగిసేవరకు మ్యాచ్ ఫలితం దోబుచులాడింది. కానీ ఆఖరి బంతికి ఊరటనిచ్చేలా మ్యాచ్ జరిగింది. డబుల్ హ్యాట్రిక్ ఓటముల తర్వాత లక్నో సూపర్ జియాంట్స్ కీలక మ్యాచ్‌లో విజయం సాధించింది. పది మ్యాచ్‌లు ఆడిన లక్నో మూడు విజయాలు, 7 ఓటములు చవిచూసింది. బెంగళూరుతో మ్యాచ్‌లో గెలిచి రెండు పాయింట్లు ఖాతాలో వేసుకున్నా పాయింట్ల పట్టికలో చివరి స్థానంలోనే లక్నో కొనసాగుతోంది. ఇక బెంగళూరు జట్టు వరుసగా రెండో ఓటమి సాధించగా.. ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడి ఆరు విజయాలు, నాలుగు ఓడిపోయింది. ఓడిపోయినా కూడా పాయింట్ల పట్టికలో టాప్ 3లోనే బెంగళూరు కొనసాగుతోంది.

# కట్ట మైసమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి





- కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం

**వర్ధన్నపేట ప్రతినిధి, మే 8,తరంగాలు :**

కట్ట మైసమ్మ తల్లి ఆశీస్సులు, అనుగ్రహం ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, అందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. వర్ధన్నపేట మండల కేంద్ర శివారు కోనారెడ్డి చెరువు కట్ట మీద నూతనంగా నిర్మించబడిన కట్ట మైసమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్య అదితిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా దేవాలయం నిర్వాహకులు ఈగ మల్లేశం కు సాదర స్వాగతం పలికి శాలువాతో సత్కరించి వారికి ప్రత్యేక పూజలు చేయించారు.అనంతరం ఈగ మల్లేశం మాట్లాడుతూ కట్ట మైసమ్మ తల్లి ఆశీస్సులతో ప్రతి ఇంట్లో సంతోషం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ఈ దేవాలయాన్ని అద్భుతంగా నిర్మించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, కౌన్సిలర్ సిలివేరు కుమార స్వామి, తుమ్మల యాకయ్య, అబ్బ ప్రకాష్ రెడ్డి, మార్త సారంగపాణి, పూజారి రఘు, కోనాపురం యాకయ్య, తుమ్మల రవీందర్, సమ్మెట శ్రీనివాస్, నందిపాక భాస్కర్, వేణు, పాలకుర్తి శ్రీకాంత్, కోనాపురం ముత్తయ్య, పుర ప్రముఖులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



### 10న జరిగే పీఎం సభను

# తెలంగాణ ప్రజలే జయప్రదం చేస్తారు

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ
- సభకు భారీగా తరలి రావడానికి సిద్ధమవుతున్నారు
- మోదీ సభ నేపథ్యంలో మీడియా సమావేశం..
- రెండు లక్షలకు పైగా తరలినున్నారని వెల్లడి, దానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం... జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్
- స్వచ్ఛందంగా ప్రజలే తరలి వస్తారు... రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు



**వరంగల్ ప్రతినిధి, మే 8, తరంగాలు :**

ఈ నెల 10 తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించనున్న ప్రధాని నరేంద్ర మోదీ సభకు ప్రజలు స్వచ్ఛందంగా భారీగా తరలిరావడానికి ఉత్సాహం చూపుతున్నారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ అన్నారు. మోదీ సభకు ప్రజలను సమాయత్తం చేసే విషయమై శు క్రవారం వరంగల్ లో మీడియా సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ అధ్యక్షతన వరంగల్ ఎల్ బీ నగర్ లోని రయాన్ ఫంక్షన్ హాల్ లో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజధానిలో నిర్వహించనున్న ప్రధాని సభకు రాష్ట్ర పార్టీ సారథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లు, జిల్లా నుంచి జనసమీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి అనంతరం మీడియాతో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకట రమణ మాట్లాడుతూ మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి తెలంగాణ గడ్డపై కాలుపెట్టబోతున్న పీఎం మోదీకి అద్భుతంగా ఘనస్వాగతం పలకడానికి ప్రజలు తండోపతండాలుగా తరలి రావడానికి ఉవ్విళ్లూతున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి మోదీ నాయకత్వంలోని బీజేపీ సర్కార్ విడుదల చేస్తున్న నిధుల వరద, చకచకా సాగుతున్న పనులపై మిక్కిలి సంతోషంగా ఉన్న జనం తమ కృతజ్ఞతలు తెలిపి సభను విజయవంతం చేయడానికి కంకణం కట్టుకున్నారని తెలిపారు. దేశ సమగ్రతకు శక్తివంచన లేకుండా శ్రమిస్తున్న ప్రధాని నరేంద్రమోదీకి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించడానికి పార్టీలకు అతీతంగా, కులమతభేదాలకు ఆస్కారం లేకుండా జనం రాబోతున్నారని వెంకటరమణ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీ పక్షాన నిలిచిన విధానం సంతోషంగా ఉందని, రాబోయే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీకే పట్టం దక్కడం ఖాయమని వెంకటరమణ ధీమా వెలిబుచ్చారు. కాగా, వరంగల్ జిల్లాకు ఇప్పటికే మెగా టెక్స్ టైల్ పార్క్ కోసం బీజేపీ సర్కార్ నిధులు విడుదల చేసిందని గుర్తు చేశారు. అలాగే కాజీపేట-విజయవాడ మూడో లైన్ పనులు, ఉమ్మడి జిల్లా కేంద్రం మీదుగా వెళ్తున్న జాతీయరహదారులకు మోదీ శంకుస్థాపన చేయనున్నారు. రెండు లక్షల మంది తరలనున్నారు : బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఈ నెల 10వ తేదీన పరేడ్ గ్రౌండ్ లోజరుగనున్న ప్రధాని నరేంద్ర మోదీ సభకు వరంగల్ జిల్లా నుంచి సుమారు రెండు లక్షల మంది తరలనున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ తెలిపారు. ఈ మేరకు కాజీపేట సహా ఖమ్మం, పెద్దపల్లి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లతో పాటు బస్సులను కూడా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. జిల్లా ప్రజల ఉత్సాహం చూసి మరిన్ని ఏర్పాట్లు కూడా చేస్తున్నట్టు చెప్పారు. ప్రజలంతా ప్రధాని మోదీకి మద్దతుగా నిలవడానికి భారీగా తరలుతారని ఆశిస్తున్నట్టు రవికుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ ప్రజలంతా ప్రధాని మోదీ పనులకు ఆకర్షితులై స్వచ్ఛందంగా మద్దతు తెలపడానికి రాబోతున్నారని తెలిపారు. 10వ తేదీన జరిగే సభలో వరంగల్ జిల్లా బలాన్ని చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని, జనమంతా పార్టీలకు అతీతంగా ప్రధానికి వెన్నుదన్నుగా నిలవడానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిద్ధం నరేష్, రాష్ట్ర నాయకులు మార్టిన్ లూథర్, మురళీకృష్ణ, మాదాసు రాజు, సతీశ్ షా ,సముద్రాల పరమేశ్వర్,జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్,గడల కుమార్, కార్యదర్శులు కపిల్, వెంకట్రావు,రఘునాథ్ రెడ్డి, కాశీబుగ్గ అధ్యక్షులు అపురూప రజనీష్ తదితరులు పాల్గొన్నారు.



# వర్ధన్నపేట కట్ట మైసమ్మ ప్రతిష్ఠాపన కొత్త వెలుగు

- సెంట్రల్ లైటింగ్ ప్రారంభించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు.
- ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం -- ఎమ్మెల్యే హామీ.



వర్ధన్నపేట ప్రతినిధి,మే 08,తరంగాలు :

వర్ధన్నపేట పట్టణంలోని చారిత్రాత్మక కట్ట మైసమ్మ ఆలయం శుక్రవారం భక్తజన సందోహంతో కళకళలాడింది. 236 ఏళ్ల చరిత్ర కలిగిన కట్ట మైసమ్మ తల్లి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించగా, నియోజకవర్గ ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు ప్రత్యేక పూజల్లో పాల్గొని తల్లిని దర్శించుకున్నారు. అనంతరం చెరువు కట్టపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

పట్టణ ప్రజల దీర్ఘకాల కోరిక మేరకు రూపుదిద్దుకున్న నూతన ఆలయ నిర్మాణంలో ఎమ్మెల్యే కీలక పాత్ర పోషించారని కమిటీ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించడంతో పాటు వ్యక్తిగతంగా ఆర్థిక సహకారం అందించి ఆలయ పునర్నిర్మాణానికి బలంగా నిలిచారని పేర్కొన్నారు. భక్తుల విరాళాలు, ప్రజల సహకారంతో ఆలయం మరింత అందంగా తీర్చిదిద్దబడిందన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు మాట్లాడుతూ..."చీకట్లలో మగ్గిపోయిన చెరువు కట్టకు వెలుగులు తీసుకురావడం సంతోషంగా ఉంది. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కరెంటు స్తంభాలు, వీధిలైట్లు ఏర్పాటు చేయించాం. కట్ట మైసమ్మ ఆలయం అభివృద్ధికి భవిష్యత్తులోనూ అవసరమైన నిధులు సమకూర్చేందుకు కట్టుబడి ఉంటాను" అని హామీ ఇచ్చారు.గత పాలకుల హయాంలో అభివృద్ధికి దూరమైన వర్ధన్నపేట నియోజకవర్గాన్ని ప్రగతి బాటలో నడిపిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చెరువు కట్టను భవిష్యత్తులో ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తామని తెలిపారు.

అంతకుముందు మంగళ వాయిద్యాలు, బోనాలు, మంగళహారతుల మధ్య కట్ట మైసమ్మ తల్లి విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్టించగా భక్తులు భారీగా తరలివచ్చారు. చెరువు కట్ట ప్రాంతం విద్యుద్దీపాల కాంతులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు బోనాలతో తల్లికి మొక్కులు చెల్లించగా యువత సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు అందించిన దాతలను కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమం ముగింపులో ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజును శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అడ్వకేట్ నిమ్మాని శేఖర్ రావు, పీఏసీఎస్ చైర్మన్ కౌడగాని రాజేష్ కన్నా, మార్కెట్ చైర్మన్ నర్కుడు వెంకటయ్య, మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, కౌన్సిలర్ పాపారావు,మాజీ సర్పంచ్ మరుపట్ల సాయికుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈగ దామోదర్, పోశాల వెంకన్న గౌడ్, కమిటీ సభ్యులు పాలకుర్తి సారంగపాణి, నీరటి సమ్మయ్య, తుమ్మల యాకయ్య, సమ్మెట శ్రీనివాస్ , కొండేటి సత్యం, చిలువేరు కుమారస్వామి, పూజారి రఘు, మైసా వీరేష్ , మార్తా సారంగపాణి, తుమ్మల శ్రీధర్, మహమ్మద్ అప్సర్ ,పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్ల సమస్యలపై సమీక్ష సమావేశం



వరంగల్ ప్రతినిధి, మే 08,తరంగాలు : రైస్ మిల్లర్ల సమస్యలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్ష సమావేశం నిర్వహించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో రైస్ మిల్లర్లు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ( ఎఫ్సీఐ) మరియు సివిల్ సప్లై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ సమావేశంలో ఎఫ్‌సీఐలో రైస్ మిల్లర్ల బియ్యాన్ని త్వరితగతిన దిగుమతి చేసుకొని ఎటువంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎఫ్‌సీఐ డీఎంను జిల్లా కలెక్టర్ కోరారు.రైస్ మిల్లర్లు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని ఎఫ్‌సీఐ అధికారులను ఆదేశించారు.

రైతులు మరియు మిల్లర్లకు ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ఎఫ్‌సీఐ డీఎం నేత్ర ప్రకాష్, సివిల్ సప్లైస్ డీఎం సంధ్యారాణి, డీసీఎస్ఓ కిష్టయ్య మరియు ఎఫ్‌సీఐ క్వాలిటీ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## నూతన వధువరులను ఆశీర్వదించిన ఎర్రబెల్లి దయాకర్ రావు,పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



రాయపర్తి, మే 08,తరంగాలు : నూతన వధువరులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఆశీర్వదించారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొత్తూరు గ్రామంలోబీఆర్ఎస్ పార్టీ నాయకులు సాన గట్టయ్య కూతురు మరియు శెట్టి శ్రీశైలం కుమారుడు శ్యామల - సంతోష్ వివాహ వేడుకలో మాజీ మంత్రి, పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల పార్టీ నాయకులు, స్థానిక పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పావలా వడ్డీకే విద్యా రుణాలు

- పేద విద్యార్థులకు చంద్రబాబు భారీ ఊరట
- జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థల్లో చదువుకు ప్రోత్సాహం
- సంక్షేమ పథకాల అమలుపై కలెక్టర్లకు కీలక ఆదేశాలు



అమరావతి, మే 8 రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు పావలా వడ్డీకే విద్యా రుణాలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఏడవ జిల్లా కలెక్టర్ల సమావేశంలో సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష సందర్భంగా సీఎం ఈ ప్రకటన చేశారు. ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ వంటి ప్రముఖ విద్యాసంస్థలతో పాటు విదేశీ యూనివర్సిటీల్లో చదవాలనుకునే విద్యార్థులకు ఈ నిర్ణయం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రత్యేక ప్రోత్సాహం ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు తగిన శిక్షణ అందించి జాతీయ స్థాయి సంస్థల్లో సీట్లు సాధించేలా చూడాలని ఆదేశించారు. విదేశాల్లో ఉద్యోగ అవకాశాల కోసం ఎస్సీ, ఎస్టీ యువతకు జర్మన్ భాష శిక్షణ కూడా అందిస్తున్నట్లు వెల్లడించారు. విద్య, నైపుణ్యాభివృద్ధి ద్వారానే యువత భవిష్యత్తు మారుతుందని సీఎం పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు పెంచి యువత జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల అమలుపై కూడా ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. "తల్లికి వందనం" పథకం ద్వారా 67 లక్షల మందికి రూ.10 వేల కోట్లు అందిస్తున్నామని తెలిపారు. "స్త్రీశక్తి" పథకం కింద మహిళలు 60.6 కోట్ల ప్రయాణాలు చేశారని, ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ.1940 కోట్లు ఖర్చు చేస్తోందని వివరించారు. "దీపం 2.0" పథకం కింద 1.08 కోట్ల మంది లబ్ధిదారులకు రూ.3504 కోట్లు అందించినట్లు సీఎం వెల్లడించారు. మత్స్యకారులకు మే 19న రూ.286 కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.బుడగజంగాలను ఎస్సీ జాబితాలో చేర్చే అంశంపై కేంద్రంతో చర్చిస్తామని సీఎం చెప్పారు. కేంద్ర అనుమతులు వచ్చే వరకు ఉద్యోగాలు మినహా ఎస్సీలకు వర్తించే అన్ని సంక్షేమ పథకాలను వారికి కూడా వర్తింపజేయాలని కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. ఆగస్టు 15 నాటికి 2.50 లక్షల ఇళ్లకు, డిసెంబర్ నాటికి మరో 2.38 లక్షల ఇళ్లకు గృహప్రవేశాలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. 2027 డిసెంబర్ నాటికి మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేలా అధికారులు పనిచేయాలని చంద్రబాబు సూచించారు. విద్య, వైద్యం, విద్యుత్ ఖర్చులు తగ్గించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. భూ వివాదాల పరిష్కారంలో భాగంగా వచ్చే కలెక్టర్ల సమావేశం నాటికి 22ఏ కింద ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు. 2027 మార్చి నాటికి భూ రీసర్వే పూర్తి చేసి పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలని ఆదేశించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి అధికారి బాధ్యతగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు.

# కట్టమైసమ్మ తల్లి అనుగ్రహంతో ప్రతి ఇంట్లో ఆనందం వెల్లివిరియాలి





- కట్టమైసమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే నాగరాజు ప్రత్యేక చొరవ
- వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో కట్టమైసమ్మ అమ్మవారి దేవాలయ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట ప్రతినిధి, మే 8,తరంగాలు : కట్టమైసమ్మ తల్లి అనుగ్రహంతో ప్రతి ఇంట్లో ఆనందం వెల్లివిరియాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆకాంక్షించారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా సీడీఎఫ్ మరియు మున్సిపల్ నిధులు రూ.4.99 లక్షలతో నిర్మిస్తున్న కట్టమైసమ్మ అమ్మవారి దేవాలయ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కరెంటు స్తంభాలు, విద్యుత్ దీపాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హాజరై కట్ట మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామాలు, పట్టణాల్లో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం ద్వారా ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.కట్టమైసమ్మ అమ్మవారి ఆలయం పరిసరాల్లో విద్యుత్ దీపాలు, కరెంటు స్తంభాల ఏర్పాటు వల్ల భక్తులకు రాత్రి వేళల్లో సౌకర్యవంతంగా దర్శనం చేసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి వర్గానికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల సహకారంతో వర్ధన్నపేటను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు...ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి-రాజేందర్, కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, నునావత్ కమ్లీ-కీమా నాయక్, మలోత్ దేవేందర్, తిరుపెల్లి వాణి-కుమారస్వామి, ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, వర్ధన్నపేట ఫ్యాక్స్ చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా, కాంగ్రెస్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్ , ఈగ దామోదర్, బాబులాల్, రామకృష్ణ, యూత్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఆగం చేయొద్దు





- రైతులతో కలిసి ఎర్రబెల్లి రాస్తారోకో
- మక్క, వరి రైతుల సమస్యలపై ఆందోళన
- వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ధర్నా

రాయపర్తి , మే 8 (తరంగాలు ప్రతినిధి): మక్క, వరి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో వరంగల్--ఖమ్మం జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు.

రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఇప్పటికే ప్రభుత్వానికి సమయం ఇచ్చినా స్పందన లేకపోవడంతో నిరసనకు దిగాల్సి వచ్చిందని ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మక్క, వరి పంటల కొనుగోళ్లు సకాలంలో జరగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని ఎర్రబెల్లి మండిపడ్డారు. పంటలు అమ్ముకోలేక రైతులు ఆర్థికంగా తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతులను ఆగం చేయొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ధర్నా కారణంగా వరంగల్--ఖమ్మం జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పెద్ద సంఖ్యలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనలో పాల్గొన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎర్రబెల్లి దయాకర్ రావు హెచ్చరించారు. రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.